క్లుప్తంగా

బావిలో పడి వ్యక్తి మృతి


మనోహర్ (ఫైల్)

వెంకటగిరి రూరల్ : మండలంలోని జంగాలపల్లెలో ఆదివారం రాత్రి బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సర్పంచ్ పాలూరు ప్రమీల భర్త, వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాలూరు మనోహర్ (40) కొంత కాలంగా పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు గాలించినా ఆచూకీ దొరకలేదు. బావిలో పడి ఉంటాడనే అనుమానంతో మోటార్ ద్వారా నీటిని తోడేయగా మనోహర్ మృతదేహం బయట పడింది. ఆయన ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే విషయం తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వెంకటయ్య మృతదేహం

చిల్లకూరు : మండలంలోని ఏరూరు రిజర్వాయర్ ప్రాంతంలో రొయ్యల గుంతల వద్ద సోమవారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఏరూరు గ్రామంలో రొయ్యల గుంత వద్ద ఏరూరు అల్లీపురానికి చెందిన దాసరి వెంకటయ్య(33) పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రొయ్యలకు మేత వేసి వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గంటలు దాటితో బయటకు రావద్దు


వేదిక్ యూనివర్సిటీ అకడమిక్ భవన్ ఎదుట సంచరిస్తున్న చిరుత

తిరుపతి సిటీ: నగరంలోని వేదిక్ వర్సిటీ, ఎస్వీయూ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోందని విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని వర్సిటీ, అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఇప్పటికే వర్సిటీల్లో చిరుత సంచరించే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి వేదిక్ వర్సిటీలోని శైక్షిక (అకాడమిక్)భవనాల వద్ద చిరుత సంచరించిందని వెంటనే సెక్యూరిటీ అప్రమత్తమై విద్యార్థులకు సమాచారం అందించారని తెలిపారు. ఎస్వీయూ, వేదిక్ వర్సిటీలలో అటవీశాఖ సుమారు నాలుగు బోన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు సాయంత్రం ఆరు గంటలు దాటితే బయటకు రాకూడదని నిషేధాజ్ఞలు విధించారు.

ప్రజా ఉద్యమానికి దిశానిర్దేశం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాటం
- రచ్చబండ..ర్యాలీలు.. కోటి సంతకాల సేకరణ
- సన్నాహక సభలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : గత ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, కల్తీ మద్యంపై పోరాటానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని, ఉద్యమానికి ప్రజలను సైతం సిద్ధం చేయాలని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సోమవారం చంద్రగిరిలోని వైఎస్ఎంఆర్ కల్యాణ మండపంలో ప్రజా ఉద్యమ సన్నాహక సభ నిర్వహించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలు, అన్యాయాలతో పాటు వైద్య విద్యను పేద ప్రజలకు దూరం చేసిన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచి కనీసం 60వేల సంతకాలను నిర్దేశిత గడువులోపు సేకరించాలని కోరారు. పేదలకు మెరుగైన వైద్యం, నిరుపేదద విద్యార్థులకు వైద్య విద్యను అందించే అవకాశం వున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాలతో పాటు ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉచితంగా వైద్యవిద్య అభ్యసించేందుకు వీలుగా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. అందులో 5 కళాశాలలను ప్రారంభించి తరగతులు నిర్వహిస్తుండగా మరో 12 కాలేజీలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఆయా నిర్మాణ పనులు పూర్తి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకువస్తే పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు లభిస్తాయని చెప్పారు. పేదలకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై చేపట్టిన పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అందుకే కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రతి పంచాయతీలో 500 నుంచి 600మందిని కలసి మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగిస్తే తలెత్తే నష్టాలను వివరించి సంతకాలు సేకరించాలని పిలుపునిచ్చారు.


సభకు హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

షెడ్యూల్ ఇదీ...

మెడికల్ కాలేజీల అంశంపై ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ చేపడుతున్న ప్రజా ఉద్యమానికి పార్టీ కేంద్ర కార్యాలయం షెడ్యూల్ విడుదల చేసిందని మోహిత్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 10 నుంచి నవంబరు 22 వరకు దశల వారీగా నిరసనలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రాలు, నవంబరు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలన్నారు. నవంబరు 23నజిల్లా కేంద్రాలకు సంతకాల సేకరణ పత్రాలు తరలించాలని వెల్లడించారు. నవంబరు 22న జిల్లా కేంద్రాల నుంచి విజయవాడకు కోటి సంతకాల సేకరణ పత్రాలు పంపించాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్:ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, అర్జీదారులకు సంతృప్తికరంగా సమాధానం చెప్పాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జీదారులకు మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం డీఆర్‌ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, సుధారాణితో కలసి అర్జీలు స్వీకరించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు మొత్తం 290 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

కనీస వేతనం కోసం..

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి రూ.18,600 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.10వేలతో సరిపెట్టేస్తున్నారని మండిపడ్డారు. సూపర్‌వైజర్లకు రూ.21,600 వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.11వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 175 అర్జీలు


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 175 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించినట్లు వెల్లడించారు.

దయచూపండి

పొలం పనులు చేసే సమయంలో ప్రమాదవశాత్తు వెన్నెముక దెబ్బతింది. దీంతో రెండు కాళ్లు పనిచేయడం లేదు. మంచానికే పరిమితమయ్యా. దివ్యాంగుల పింఛన్ ఇప్పిస్తే వైద్య ఖర్చులు పెట్టుకుంటా. దయచూపండి. ఎన్నిసార్లు కలెక్టరేట్ చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోంది. ప్రభుత్వం నుంచి కొత్త పింఛన్లకు అనుమతి రాలేదని తిప్పి పంపేస్తున్నారు.

– మునస్వామి, దివ్యాంగుడు, చంద్రగిరి

టిప్పర్ ఢీకొని వైఎస్సార్‌సీపీ నేత మృతి

రామచంద్రాపురం : మండలంలోని సి.రామాపురం వద్ద సోమవారం టిప్పర్ ఢీకొని వైఎస్సార్‌సీపీ నేత సురేంద్రనాయుడు(63) మృతి చెందారు. వివరాలు.. కొత్తకండ్రిగకు చెందని సురేంద్రనాయుడు కూరగాయల సాగు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పంట ఉత్పత్తులను తిరుపతిలోని రైతుబజారులో విక్రయించి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా బండరాళ్ల లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేంద్రనాయుడి కాలు నుజ్జునుజ్జుగా మారింది. క్షతగాత్రుడు తీవ్రమైన రక్తస్రావంతో ఘటనాస్థలంలోనే కొంత సమయంపాటు నరక యాతన అనుభవించాడు. అదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారు ఆయనను కాపాడేందుకు విఫలయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

మోహిత్‌రెడ్డి పరామర్శ

వైఎస్సార్‌సీపీ నేత సురేంద్ర నాయుడు మృతి విషయం తెలుసుకున్న చెవిరెడ్డి మోహిత్ సోమవారం రాత్రి కొత్తకండ్రిగ గ్రామానికి చేరుకున్నారు. సురేంద్ర నాయుడు భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు.

ఎస్పీడీసీఎల్ సీఎండీగా శివశంకర్

తిరుపతి రూరల్ : ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీగా లోతేటి శివశంకర్ నియమితులయ్యారు. విజయనగరం జిల్లాకు చెందిన ఆయనను రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ ఐఏఎస్ క్యాడర్‌కు కేటాయించారు. దీనిపై ఆయన డీఓపీటీను ఆశ్రయించారు. ఎట్టకేలకు ఏపీ కేడర్‌కు పంపించారు. ఈ క్రమంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు రిపోర్ట్ చేశారు. అనంతరం ఎస్పీడీసీఎల్ సీఎండీగా ప్రభుత్వం నియమించడంతో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కలసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. అనంతరం ప్రధాన శాఖల ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు.

సంతోష్‌రావుకు వీడ్కోలు

ఎస్పీడీసీఎల్ సీఎండీగా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సంతోషరావు ఉద్యోగ విరమణ చేయడంతో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.


సీఎండీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇంజినీర్లు

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

తిరుపతి రూరల్ : ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని, ప్రతి ఒక్క రైతుకు సోలార్ పవర్‌ను చేరువ చేస్తామని నూతన సీఎండీ లోతేటి శివశంకర్ తెలిపారు. ఆయన సోమవారం తిరుపతి నగరంలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

నేడు అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 జిల్లా జట్ల ఎంపిక మంగళవారం నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 సెక్రటరీ ఎస్.బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అండర్-19 ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 1-1-2007 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి జిల్లా కేంద్రంలోని శ్రీనివాస స్పోర్ట్స్ మైదానంలో జూడో బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. 15వ తేదీన ఉదయం 8.30 గంటలకు అన్నమయ్య జిల్లా, మదనపల్లి జెడ్పీ హైస్కూల్ మైదానంలో బాస్కెట్‌బాల్, హాకీ, నెట్‌బాల్, హ్యాండ్‌బాల్ క్రీడా ఎంపికలుంటాయని తెలిపారు. 16వ తేదీన ఉదయం 8.30 గంటలకు చిత్తూరు జిల్లాలోని పలమనేరు జెడ్పీ హైస్కూల్ మైదానంలో వాలీబాల్, బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9440758047, 7013554202 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

స్త్రీనిధి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : స్త్రీనిధి రుణ వాయిదాల వివరాలతో కూడిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోస్టర్ ద్వారా మహిళలు రుణ వాయిదాలను సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి, స్త్రీనిధి విభాగం అధికారులు హేమంత్‌కుమార్, రవి కుమార్ పాల్గొన్నారు. అలాగే కార్డియో పల్మనరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, అధికారులు శాంతకుమార్, మంజుల, షేక్ ఖాజావలీ, మురళి పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా సేవ్ గర్ల్ చైల్డ్ అవేర్‌నెస్ వీక్ బ్యానర్‌ను ఆవిష్కరించారు.

వేర్వేరు చోట్ల బాణసంచా పట్టివేత


తనపల్లెలో బాణసంచా గోడౌన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట/చంద్రగిరి : జిల్లాలోని సూళ్లూరుపేట పట్టణం, చంద్రగిరి నియోజకవర్గంలోని తనపల్లెలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ.7.5లక్షల బాణసంచాను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. వివరాలు.. సూళ్లూరుపేట పట్టణంలోని కోటపోలూరు రోడ్డులో ఉన్న గోడౌన్‌లో లైసెన్స్ లేకుండా నిల్వ చేసిన సుమారు ' 2.5 లక్షలు విలువ చేసే 85 బాక్సులు బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. అలాగే తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తనపల్లెలో కొల్లు దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి నిల్వ చేసిన రూ.5లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సునీల్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

బాధిత కుటుంబాలకు చేయూత


చెక్ అందిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు కుటుంబాలకు ఎస్పీ సుబ్బరాయుడు బాసటగా నిలిచారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత నెల 12న అనారోగ్యంతో మరణించిన టీఎల్. వెంకటరత్నం సతీమణి టీ.ఉషాదేవికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వాహణలో సేవలందించి ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీస్ శాఖ ఎప్పటికీ మరిచిపోదన్నారు. వీరి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడంలో సంబంధిత శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వర పాల్గొన్నారు.

ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం

ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమని ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి స్పష్టం చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం మ్యాంగో మార్కెట్ యార్డు సమీపంలోని గరుడ వారధి వద్ద ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన దారులకు ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు ఓ పుష్పాన్ని అందించారు. హెల్మెట్- ప్రాణ రక్షక కవచం అంటూ నినాదాలు చేశారు. గరుడ వారధిపై గరిష్ట వేగ పరిమితి 30 కి.మీ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు సంజీవ్ కుమార్, సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు బాలాజీ, విజయలక్ష్మి పాల్గొన్నారు.


హెల్మెట్ ఉపయోగాలను వివరిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి

మహిళా క్రికెట్ జట్టులో ఐదుగురికి చోటు


క్రికెట్ జట్టుకు ఎంపికైన గిరిష్మా సైనిరెడ్డి(వైస్ కెప్టెన్), ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణిత యాదవ్, కె.శుభశ్రీ

- వైస్ కెప్టెన్‌గా గిరిష్మా సైనిరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్:ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఇటీవల ప్రకటించిన ఆంధ్రా ఉమెన్స్ అండర్-19 క్రికెట్ జట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఐదుగురు చోటు సాధించినట్లు ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ తెలిపారు. వీరిలో గిరిష్మా సైనిరెడ్డి (వైస్ కెప్టెన్), ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణిత యాదవ్, కె.శుభశ్రీ, ఎం.రుక్సార్ తబ్బుమ్ వున్నారని తెలిపారు. వీరు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు బీసీసీఐ అండర్-19 ఉమెన్స్ టీ-20 చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన మహిళా క్రికెటర్లు బాగా రాణించి రంజీ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.


ఎం.రుక్సార్ తబ్బుమ్

శభాష్ పోలీసు..!

- ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి
- డయల్ 100కు సమాచారం రావడంతో కాపాడిన పోలీసులు

చంద్రగిరి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెంటనే స్పందించారు. అక్కడికి చేరుకుని అతన్ని కాపాడి శభాష్ అనిపించున్నారు. తిరుపతికి చెందిన మురళీనాయక్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా కుటుంబ కలహాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది తనువు చాలించాలని నిర్ణయించుకున్నారు. శ్రీనివాసమంగాపురం సమీపంలో రైల్వే ట్రాక్‌పైకి చేరుకున్నాడు. డయల్ 100కు ఫోన్ చేసి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన చావుకు ఎవరూ కారణం కాదని తెలిపారు. అప్రమత్తమైన కమాండ్ కంట్రోల్ అధికారులు చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్లూకోట్స్‌లో విధుల్లో వున్న కానిస్టేబుల్ చిరంజీవి, కిరణ్, శ్రీను ఫోన్ నంబరు ఆధారంగా మురళీ నాయక్ వద్దకు చేరుకున్నారు. అతనికి నచ్చజెప్పి క్షేమంగా తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కౌన్సిలింగ్ అనంతరం ఇంటికి పంపించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.


ఆత్మహత్యకు యత్నించిన మురళీ నాయక్‌తో మాట్లాడుతున్న చంద్రగిరి పోలీసులు

విచ్చలవిడి మద్యం విక్రయాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా?


అలిపిరి పోలీసుల అదుపులో ఉన్న నవీన్


సోషల్ మీడియాలో పోస్టు చేసిన కపిలతీర్థం వద్ద మందుబాబు పడి ఉన్న చిత్రం

- సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన నవీన్ అరెస్ట్
- రెడ్బుక్ పాలనకు నిదర్శనమంటూ భూమన అభినయ్ రెడ్డి ఆగ్రహం

తిరుపతి మంగళం: కూటమి పాలనలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలపై సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తే కేసులు పెడతారా అంటూ తిరుపతి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మద్యం సేవించి నడిరోడ్డుపై పడిపోయిన చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వైఎస్సార్‌సీపీ తిరుపతి దక్షిణ విభాగం అధ్యక్షుడు నవీన్ పై అలిపిరి పోలీసులు సోమవారం రాత్రి అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. దీంతో సోమవారం అర్ధరాత్రి భూమన అభినయ్ రెడ్డితో కలసి వందలాదిమంది పార్టీ శ్రేణులు అలిపిరి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని కూటమి పాలనలో అరాచకాలు, పోలీసుల తీరును ఖండించారు. కూటమి పాలనలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేసేందుకు కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం దారుణం అన్నారు.


డీఎస్పీ భక్తవత్సలంతో మాట్లాడుతున్న అభినయ్ రెడ్డి


అలిపిరి పోలిస్ స్టేషన్ వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మద్యంపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ



నకిలీ మద్యం, బెల్ట్‌షాపులు వద్దని నిరసిస్తూ ర్యాలీ చేస్తున్న మోహిత్‌రెడ్డి, పార్టీ నాయకులు



ఎక్సైజ్ సీఐకు వినతి పత్రం ఇస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, పార్టీ నేతలు

- చంద్రగిరిలో ర్యాలీ
- ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన
- నకిలీ మద్యం, బెల్టుషాపులను నియంత్రించాలని డిమాండ్

చంద్రగిరి: కల్తీ మద్యంపై వైఎస్సార్ సీపీ నేతలు కదం తొక్కారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. తొలుత నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్కడెక్కడ నకిలీ మద్యం బయటపడింది? అందులో పాత్రధారులైన టీడీపీ నేతల గురించి ప్లకార్డులు, బ్యానర్లతో చాటిచెప్పారు. మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులను నియంత్రించాలని నినాదాలతో హోరెత్తించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ, చిత్తూరు జిల్లాలోని ములకలచెరువులో పెద్ద ఎత్తున నకిలీ మద్యం బైటపడిన ఉదంతంపై వాస్తవాల నిగ్గు తేల్చడానికి కేసును సీబీఐకు అప్పగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో బెల్టు షాపులు, పర్మిట్ రూమ్‌లకు అవకాశం లేకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహిస్తే, కూటమి ప్రభుత్వం ఊరూరా మద్యం ఏరులై పారిస్తోందని, కుటుంబాలను వీధిన పడేస్తోందని మండిపడ్డారు. గుడి, బడి అని లెక్క లేకుండా ఎక్కడబడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి, ప్రజల ప్రాణాలు హరిస్తోందని విమర్శించారు. అంతేకాకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి, మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్టు షాపులు నిర్వహిస్తూ పేదల జేబులు కొల్లకొట్టడమే ధ్యేయంగా ప్రభుత్వం సాగుతోందని నిప్పులు చెరిగారు. ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో వంద బెల్టు షాపులను గుర్తించామని, ఆ వివరాలు అన్నీ ఎక్సైజ్ అధికారులకు అందజేసినట్టు చెప్పారు. కల్తీ మద్యం, బెల్టు షాపులు నియంత్రణకు తాము పార్టీ తరపున పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనేతలు,కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఆ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోండి'



వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి విభాగ నాయకులు

చంద్రగిరి: వెటర్నరీ యూనివర్సిటీలో దళిత ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రొఫెసర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు డిమాండ్ చేస్తూ సోమవారం ఆ వర్సిటీ వీసీ జేవీ.రమణకు వినతి పత్రం ఇచ్చారు. విద్యార్థి నాయకుడు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, వెటర్నరీ వర్సిటీలో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ సూర్యనారాయణ, దళిత ఉద్యోగిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, లైంగిక ఆరోపణపై పూర్తి విచారణ చేసి సస్పెండ్ చేయాలని కోరారు. మహేష్, పవన్, నవీన్, వినయ్, వంశీ, ప్రశాంత్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రి క్యాజువాలిటీ ప్రాంగణంలో సోమవారం రోగుల సహాయకులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్ క్యాజువాలిటీ అత్యవసర సమయంలో సీపీఆర్ వాడే పద్ధతి గురించి తెలియజేశారు.

ఫార్మాకో విజిలెన్స్‌తో ఉజ్వల భవిష్యత్తు



నిరంజన్ బాబు

రామచంద్రాపురం: మండలంలోని వెంకటరామాపురం సెవెన్ హిల్స్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఫార్మాకో విజిలెన్స్ ఇన్ ఇండియ రోల్ డ్రగ్స్ కెరీర్ అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. ప్రిన్సిపల్ నిరంజన్ బాబు మాట్లాడుతూ, ఫార్మా విజిలెన్స్, పరిశోధనలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం సన్మానించింది.

కురుబ సంఘం కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్రస్థాయి నుంచి గ్రామీణ స్థాయి అధ్యక్ష ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు, సంఘం ఎన్నికల కన్వీనర్ జబ్బల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న విజయవాడలో నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డికుమార్ మాట్లాడుతూ, ఇటీవల తిరుపతిలో కనకదాసు విగ్రహావిష్కరణ కేవలం ఒక పార్టీకి సంబంధించినదిగా చేయడం ఎంతమాత్రమూ సరికాదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కురబ సామాజిక వర్గానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చారో వివరించారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ



తిరుపతి తుడా: సూపర్ జీఎస్టీ 2.0 వలన కలిగే ప్రయోజనాలపై సోమవారం నగర పాలక సంస్థ నుంచి టౌన్ క్లబ్ కూడలి వరకు మోటార్ సైకిళ్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య మాట్లాడారు. 19వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, నగరపాలక, జీఎస్టీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తిరుపతి కల్చరల్: రాస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, ఆర్‌కే. ఏజెన్సీ ఎండీ బాలాజీ చౌదరి తన జన్మదినం సందర్భంగా సోమవారం మంగళంలోని రాస్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

జాగ్రత్తలతో దీపావళి: డీఆర్వో

తిరుపతి అర్బన్: ఈ నెల 20న దీపావళి పండుగను ప్రత్యేక జాగ్రత్తలతో జరుపుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు కోరారు. బాణసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుపై సోమవారం కలెక్టరేట్‌లో అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, అధికారులతో డీఆర్వో సమీక్షించారు. రెవెన్యూ, పోలీస్, విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక శాఖ అధికారులు బాణసంచా దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, అగ్నిమాపక జిల్లా అధికారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక ఎలా?

తిరుపతి కల్చరల్: జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల బోధనేతర సంఘంలోని కొందరిని మభ్యపెట్టి సంఘ నిబంధనలకు విరుద్ధంగా విజయవాడలో సోమవారం ఎన్నిక చేసిన రాష్ట్ర కమిటీని చెల్లదని, ఈ కమిటీని తాము వ్యతిరేకిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఈ కమిటీ ప్రతినిధుల మాటలను, సంఘం ప్రతినిధులు, సభ్యులు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

ఔషధ మొక్కల పెంపకంతో ఉపాధి

తిరుపతి సిటీ : ఔషధ మొక్కల పెంపకంతో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి అవుల చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఔషధ మొక్కలు- ఉపాధి అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కాలేజీ ఆవరణలో హెర్బల్ నర్సరీ ఏర్పాటుకు రూ. 6.25 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జున రావు, బోటనీ విభాగాధిపతి ఏ.సురేఖ, పూర్వ అధిపతి డాక్టర్ ఎం.నాగరాజు, ఫ్యాకల్టీలు డాక్టర్ ఎం. సుధాకర్, డాక్టర్ కె. సుజాత, ఆయుర్వేద కళాశాల సహాయ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.పవన్ కుమార్, శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. సాయి వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 46 వినతులు



కమిషనర్‌కు సమస్యలు నివేదిస్తున్న ప్రజలు

తిరుపతి తుడా: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 36, డయల్ యువర్ కమిషనర్‌కు 10 ఫిర్యాదులు అందినట్టు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. యాదవ వీధిలో తాగునీటిలో మురుగు నీరు కలుస్తోందని, ఈ సమస్యను పరిష్కరించాలని, పింఛన్ ఇప్పించాలని, కొర్లగుంట రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలని, మురుగు కాలువలు శుభ్రం చేయాలని, యాదవ వీధి, కూరపాటి లేఔట్ వద్ద రోడ్లు వేయాలని వినతులు అందాయి. అలాగే కొర్లగుంట మారుతీ నగర్‌లో వర్షపు నీరు నిలవకుండా చూడాలని, ఏఆర్ హాస్పిటల్ రోడ్డులో అనధికారిక నిర్మాణాలు అడ్డుకోవాలని, కుక్కల బెడద లేకుండా చూడాలని వినతులు అందాయి. సంబంధిత అధికారులు వీటిని పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. సాయంత్రం అధికారులతో వినతులపై కమిషనర్ సమీక్షించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

పరిశోధనల్లో ప్రగతి సాధిద్దాం

–ఫిజిక్స్ అధ్యాపకులతో ఎస్వీయూ వీసీ



వీసీని సత్కరిస్తున్న ఫిజిక్స్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పరిశోధనల్లో ప్రగతి సాధించాలని ఎస్వీయూ వీసీ నరసింగరావు కోరారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన వీసీని ఫిజిక్స్ అధ్యాపక బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించింది. అనంతరం వీసీ వారితో మాట్లాడారు. ఫిజిక్స్ విభాగం పరిశోధనల్లో ప్రగతిని సాధించేందుకు అన్ని విధాల సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాదరాజు, హుస్సేన్, పద్మావతి, రాజగోపాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ మాజీ వీసీకి ఘన సన్మానం

తిరుపతి సిటీ: 15 నెలలపాటు ఇన్‌చార్జ్ వీసీగా సేవలందించిన ఆచార్య అప్పారావును నూతన వీసీ ఆచార్య నర్సింగరావు సోమవారం తన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ముమ్ముందు అప్పారావు సేవలు, అనుభవాలను తాను ఉపయోగించుకుంటానన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపాళ్లు, డీన్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సమస్యలకు 'టెలి మానస్'తో పరిష్కారం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, వైద్య శాఖ సిబ్బంది

తిరుపతి సిటీ: మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన వారోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సోమవారం ఎస్వీ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్రిన్సిపల్ డాక్టర్ సి.ప్రకాష్ బాబు, అధ్యాపకులు డాక్టర్ సీఎల్.చెన్నారెడ్డి, డిస్ట్రిక్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం స్టాఫ్ మెంబర్ డాక్టర్ పి.ఉదయ్ కిరణ్ తదితరులు మానసిక ఆరోగ్య సమస్యలు, పరిష్కార మార్గాలపై మాట్లాడారు. విద్యార్థులు మానసిక సమస్యలతో బాధపడుతున్న పక్షంలో చరవాణి ద్వారా టెలి మానస్ 14416కి కాల్ చేసి సంప్రదిస్తే కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం, ఉపశమనం లభిస్తుందన్నారు. ఆ తర్వాత విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.

పవిత్రాల సమర్పణ



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు

చంద్రగిరి: స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో రెండో రోజు సోమవారం పవిత్ర సమర్పణ భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత సుప్రభాత సేవ, పూజార్చన..ఇత్యాది కార్యమాల అనంతరం యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రద క్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. అనంతరం మూలవర్లు, ఉత్సవమూర్తుల తోపాటు 12 మంది ఆళ్వార్లు, ఆంజనేయస్వామి, విష్వక్సేనుడు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమ గుండాలు, బలిపీఠం, ధ్వజస్తంభానికి, విమాన గోపురానికి పవిత్రాలు సమర్పించారు.ఆలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెవిరెడ్డిపై చెక్కుచెదరని అభిమానం..!



విజయవాడ కోర్టు వద్ద చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మిని కలిసిన పాకాల మండల నేతలు



ఏసీబీ కోర్టు వద్ద చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని కలిసిన పాకాల మండల నేతలు

– పార్టీ నేతలతో కిటకిటలాడిన విజయవాడ కోర్టు ప్రాంగణం

తిరుపతి రూరల్: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై ప్రజల్లో అభిమానం చెక్కు చెదరలేదు. ఆయనను కూటమి ప్రభుత్వం అక్రమ లిక్కర్ కేసులో అరెస్టు చేసి జైలులో ఉంచడం విదితమే. ఈ నేపథ్యంలో 13న సోమవారం విజయవాడ జిల్లా జైలు నుంచి ఏసీబీ కోర్టుకు చెవిరెడ్డిని హాజరు పరుస్తారని తెలియడంతో ఆ పార్టీ నేతలు రైళ్లు, కార్లు, బస్సుల్లో వందలాదిగా అక్కడికి చేరుకున్నారు. తొలుత అక్కడ పార్టీ నేతలందరినీ చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పలకరించారు. ఇంతలో జైలు నుంచి సిట్ అధికారులు చెవిరెడ్డిని కోర్టుకు తీసుకురాగా పార్టీ నేతలు ఆయనను కలిసి మాట్లాడారు. పాకాల నుంచి వందల సంఖ్యలో వెళ్లిన పార్టీ క్యాడర్‌కు ఆయన ధైర్యాన్ని నింపారు.

నూతన పరిశోధనలపై దృష్టి సారించరూ!

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నూతన పరిశోధనలకు పెద్దపీట వేసే దిశగా నూతన వీసీ దృష్టి సారించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ కోరారు. సోమవారం నూతన వీసీ నర్సింగరావును మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. వర్సిటీ సమస్యలను నివేదించారు. కార్యక్రమంలో మాదిగ జన సైన్యం అధ్యక్షుడు సుధాకర్ మాదిగ, జేఏసీజిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్, రాయలసీమ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జ్యోతి కుమార్, భారతీయ దళిత సేన స్టేట్ సెక్రటరీ యుగంధర్, జిల్లా అధ్యక్షుడు జేడీ ప్రసాద్, ఆఖి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, గిరిజన జన సమాజ్ ప్రెసిడెంట్ మహేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు

పంటలపై ఏనుగుల దాడి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం తుమ్మచేనుపల్లె గ్రామ రైతుల పంటలకు ఏనుగులు నష్టం కలిగించాయి. టెంకాయ చెట్లను, వరిపంటను ధ్వంసం చేశాయి.

స్వదేశీ వస్తువులనే ప్రోత్సహిద్దాం

చంద్రగిరి: భారతదేశం స్వదేశీ నినాదంతో ముందుకు సాగినట్లయితే దేశంలో నూతన పరిశ్రమలు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిరుచానూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఆత్మ నిర్భర్ భారత్ కోస్తా జిల్లాల కన్వీనర్ అశోక్ రాజు, సామంచి తదితరులు మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వదేశీ ఉత్పత్తుల వాడకం పెంపొందించాలనే లక్ష్యంతో సెప్టెంబర్ 25 నుంచి డిసెంబర్ 25 వరకు దేశవ్యాప్తంగా ఆత్మ నిర్భర్ భారత్ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం స్వదేశీ వస్తువులనే ప్రోత్సహిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రంగుల గోపి, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శులు బీడీ బాలాజి, నరేష్, మునికృష్ణ, ఆత్మ నిర్భర్ భారత్ కన్వీనర్లు నాదముని, యువ మోర్చా, ఎస్సీ మోర్చా నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు..



